## క్లుప్తంగా

### కూలిన ఇంటి గోడ.. తప్పిన ప్రమాదం



కామవరపుకోటలో వర్షాలకు కూలిన ఓ ఇంటి గోడ

**కామవరపుకోట:** తుపాను కారణంగా గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కామవరపుకోటకు చెందిన నూనె సుబ్బలక్ష్మికి చెందిన పెంకుటిల్లు ఇటుకల గోడ మంగళవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. గట్టిగా శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయంతో ఘటనా స్థలానికి వచ్చారు. భర్త మృతి చెందడంతో సుబ్బలక్ష్మి ఒంటరిగా ఆ ఇంటిలో నివాసం ఉంటుంది. అదృష్టవశాత్తు అదే ఇంట్లో పక్క గదిలో ఆమె ఉండడంతో క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడింది. దీనితో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

### బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

**బుట్టాయగూడెం:** ఉపాధి కూలీల బకాయిలను చెల్లించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం కూలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించకపోవడం వల్ల కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే కూలీలకు పనిముట్లు, పారలు, గునపాలు, గమేళాలు వంటి పనిముట్లను ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూలీలు బి.డేవిడ్ రాజు, రాజు, వెంకటేశ్వరరావు, శామ్యేలు, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవేంకటేశ్వరస్వామిగా.. జగన్నాథుడు



వేంకటేశ్వరస్వామి అలంకారంలో జగన్నాథుడు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారిగా జగన్నాథుడు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాసుని దివ్యమంగళ స్వరూపాన్ని పెద్ద ఎత్తున భక్తులు దర్శించి, తరించారు. జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయ మండపంలో స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలు బుధవారంతో ముగియనుండగా, ఈ ప్రత్యేక అలంకారాలు మంగళవారంతో ముగిశాయి.

### మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో...



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈవో కొండలరావు

**జంగారెడ్డిగూడెం రూరల్:** గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అధికారులు వారికి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈవో కొండలరావు చైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులను శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

### ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మృతి



పి.సత్తిరాజు (ఫైల్)

**లింగపాలెం:** లింగపాలెం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పరసా సత్తిరాజు (50) మంగళవారం ధర్మాజీగూడెంలోని తన నివాసంలో గుండె పోటుతో మృతిచెందారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు సత్తిరాజు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సత్తిరాజు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# పచ్చిరొట్ట సాగు.. పుడమికి రక్ష

- భూసార పరిరక్షణపై రైతుల్లో పెరిగిన చైతన్యం
- దిగుబడుల పెంపునకు పచ్చిరొట్ట సాగుపై ప్రత్యేక దృష్టి
- రాయితీపై విత్తనాల పంపిణీ



ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో సాగవుతున్న జీలుగ



బుట్టాయిగూడెంలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

**ద్వారకాతిరుమల:** ఆధునిక వ్యవసాయం రైతన్నలకు లాభాలు తెచ్చిపెడుతున్నా.. పుడమి తల్లికి మాత్రం తీరని నష్టాన్ని కలిగిస్తోంది. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువుల వాడకం వల్ల నేల స్థితిగతులు మారి, భూసారం క్రమంగా తగ్గిపోతోంది. నేలల్లో చౌడు శాతాన్ని పెంచడంతో పాటు సహజ లక్షణాలను దెబ్బతీస్తోంది. వీటి వాడకాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. అందుకే వ్యవసాయాధికారులు భూసారాన్ని పరిరక్షించడంపై దృష్టి సారించారు. రైతులకు పచ్చిరొట్ట సాగు ఆవశ్యకతపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు, సబ్సిడీపై విత్తనాలు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు. దాంతో భూసార పరిరక్షణపై రైతుల్లోనూ చైతన్యం పెరిగింది. పచ్చిరొట్ట సాగుతో భూసారాన్ని పరిరక్షించుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకుని భూసారాన్ని పెంచుకుంటున్నారు. తద్వారా దిగుబడులు గణనీయంగా పెంచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతులు పచ్చిరొట్ట సాగుపై శ్రద్ధ చూపుతున్నారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల మండలంలోని దొరసానిపాడు, బుట్టాయిగూడెం, పి.కన్నాపురం, ఎం.నాగులపల్లి, కొమ్మర, గుణ్ణంపల్లి, నారాయణపురం తదితర గ్రామాల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము పంటలను వేశారు.

**పచ్చిరొట్టతో ప్రయోజనాలివే..**

నేలను సత్తువ చేసుకోకుండా వరి సాగు చేసుకుంటూ పోవడం వల్ల భూమి నిస్సారమై దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. రసాయన ఎరువులను విరివిగా వాడాల్సి రావడంతో వాటి ఖర్చు గణనీయంగా పెరుగుతోంది. పచ్చిరొట్ట పంట సాగు చేయడం వల్ల నేలను సారవంతం చేసుకోవచ్చు. తద్వారా దిగబడులను గణనీయంగా పెంచుకోవడంతో పాటు రసాయన ఎరువులను బాగా తగ్గించుకోవచ్చు. తద్వారా ఎరువుల ఖర్చు బాగా తగ్గుతుంది. అందుకే పంట విరామ సమయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. పచ్చిరొట్ట పంట సాగుకు రెండు నెలల వ్యవధి అవసరం. విత్తనాలు చల్లాక 45 రోజులకు పూత దశకు వస్తుంది. ఆ సమయంలో పొలంలో పంటను కలియదున్ని 15 రోజులపాటు మురగపెట్టాలి. అప్పుడే భూమిలోని లవణాలుపైకి చేరి నేల సారవంతం అవుతుంది.

**ప్రభుత్వ ప్రోత్సాహం..**

రైతులు నేలను సారవంతం చేసకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లి పెసర, జీలుగ, జనుములను యాభై శాతం రాయితీతో రైతులకు అందిస్తోంది. జీలుగలు, జనుములు పది కిలోల సంచి రూ.880 కాగా, రాయితీపై రూ.440కే అందిస్తోంది. పిల్లి పెసర్లు పది కిలోలు రూ.1340 కాగా, రూ.670 లకే అందిస్తోంది.

**రైతుల్లో చైతన్యాన్ని తెచ్చేందుకు కృషి**



పచ్చిరొట్ట సాగు ఆవశ్యకతపై రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నాం. పచ్చిరొట్ట సాగుతో మంచి ఫలితాలు ఉండడంతో ఏటా సాగుచేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే ద్వారకాతిరుమల మండలంలోని రైతులకు 36 క్వింటాళ్ల జీలుగ, 7 క్వింటాళ్ల పిల్లిపెసర, 12 క్వింటాళ్ల జనుము విత్తనాలను అందించాం.

– ఎ.దుర్గారమేష్, మండల వ్యవసాయాధికారి

### ఏఐకేఎంఎస్ సమావేశాన్ని జయప్రదం చేయాలి



కన్నాపురంలో ఏఐకేఎంఎస్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

**కొయ్యలగూడెం:** ఈనెల 20వ తేదీన నిర్వహించే ఏఐకేఎంఎస్ (అఖిల భారత రైతు కూలీ సంఘం) సమావేశాన్ని జయప్రదం చేయాల్సిందిగా సంఘ నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. రైతు కూలీలు, ఆదివాసీలు, దళితులు, పేద వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాట నేపథ్యంలో భాగంగా రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కన్నాపురంలోని కామ్రేడ్ ధర్మన్న భవనం కార్యాలయంలో అఖిల భారత రైతు కూలీ సంఘం సమావేశం నిర్వహించి అనంతరం డిమాండ్లతో కూడిన ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పోస్టర్‌ను ఈ సందర్భంగా నాయకులు ఆవిష్కరించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సున్నం సోమరాజు, జిల్లా అధ్యక్షుడు వేట్ల బాబుల్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందర్‌రావు, కార్యదర్శి సముద్రాల బాల సుందరం, పార్టీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

**జంగారెడ్డిగూడెం:** అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ధర్మన్న భవనం పార్టీ కార్యాలయంలో అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు.

**మర్రిగూడెంలో సమావేశం**

**బుట్టాయగూడెం:** ఈ నెల 20వ తేదీన రాజమండ్రిలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎమ్ఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందరరావు కోరారు. మండలంలోని మర్రిగూడెంలో మంగళవారం ధర్మన్న భవన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆ సంఘ నాయకులు విడుదల చేశారు.

# పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణచైతన్య

**జంగారెడ్డిగూడెం:** పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జంగారెడ్డిగూడెం మండల సీపీఐ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల పదవీవిరమణ చేసిన కార్మికులకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, అలాగే పదవీవిరమణ చేసిన కార్మికుల కుటుంబాల్లో అర్హత కలిగిన వారికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో స్కిల్స్ ప్రాతిపదికను వేతనాలు ఇవ్వాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం స్కిల్డ్ వర్కర్స్‌కి జాతీయ సెలవులు వర్తింప చేయాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ మాట్లాడుతూ ఒక్కొక్క కార్మికుడికి ఒకే పీఎఫ్ ఖాతా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వర్షాకాలంలో కార్మికులకు రెయిన్ కోట్స్, టార్చ్ లైట్స్, మున్సిపాలిటీ నుంచి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా జంగారెడ్డిగూడెం పట్టణం రోజురోజుకి శరవేగంగా విస్తరిస్తున్నందున జనాభా నిష్పత్తికి అనుగుణంగా కార్మికులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జంపన వెంకటరమణరాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పారిశుధ్య విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి నాగేశ్వరరావు, బొక్క శ్రీనివాసరావు, నాయకులు ఇంగుర్తి నాగరాజు, కొత్తూరి శ్రీను, పొడుదొలు రమణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు తొలి ఏకాదశి మహోత్సవాలు

**బుట్టాయగూడెం:** మండలంలోని కుమ్మరిగట్టు సమీపంలో ఉన్న విజయగణపతి ఆలయంలో తొలి ఏకాదశి మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి సోంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.15 గంటలకు ఏకాహ మహోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే ఏకవార రుద్రాభిషేకము, భక్త రంజని, భజనా కాలక్షేపం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

### శయన ఏకాదశికి ఆలయాల ముస్తాబు



విధమ్మ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

**కొయ్యలగూడెం:** తొలి ఏకాదశికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గ్రామ దేవతల ఆలయాలతో పాటు వైష్ణవ ఆలయాలను ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దుతున్నారు. మండల వ్యాప్తంగా రజకులు తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో కోనేరు గట్లపై ఉన్న రజకుల కులదేవత విధమ్మ ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. శ్రీమహావిష్ణువు పాలకడలిలో శేష పాన్పుపై యోగ నిద్రలోకి ఉపక్రమించే పర్వదినమే తొలి ఏకాదశి అని అర్చకులు గుడిపూడి శేషాచార్యులు తెలిపారు.

### 27న రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్

**దెందులూరు:** కాకినాడలో ఈ నెల 27న అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ (ఏఏఎఫ్) రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీల న్యాయవాదుల, జర్నలిస్టుల సమావేశం కాకినాడ పట్టణం డీ-కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్టు చైర్మన్, న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ అన్నారు. జిల్లాల్లో ప్రచారంలో భాగంగా రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాపుపై మంగళవారం అలుగులగూడెం, మలకచర్ల, పెరుగ్గూడెంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులు, న్యాయవాదులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, విద్యావైద్య అధికారుల మేధావులు హాజరుకావాలని చైర్మన్ వెంకటరామకృష్ణ అన్నారు.

# కౌలు కార్డుల అందజేత



కొయ్యలగూడెంలో రైతులకు కౌలు కార్డులు అందజేస్తున్న దృశ్యం



తడికలపూడిలో రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

**కొయ్యలగూడెం:** వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే కౌలు కార్డులను అర్హులైన ప్రతి ఒకరికి అందేటట్లు ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగపతిదేవిపేటలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంట సాగుదారు రైతులకు కౌలు కార్డులు అందజేసే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న కౌలు కార్డులను ప్రతి ఒక్క రైతు తీసుకోవాలన్నారు. కౌలు కార్డులు ఉండటం వల్ల సాగుదారులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ అబ్బు సుబ్రహ్మణ్యం, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గన్నమని రత్నాజీ, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ఎం.సూర్య, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

**కామవరపుకోట:** తడికలపూడి రైతు సేవా కేంద్రంలో భూమి కలిగిన రైతులకు, కౌలు రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి, అర్హత గల వారికి కౌలు రైతు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారి రమేష్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు రైతు భరోసా వర్తిస్తుందన్నారు. ఆ కార్డుల ద్వారా ఈ క్రాప్ నమోదు చేయించుకుని పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందవచ్చునని తెలిపారు. కనుక కౌలు రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకుని ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన శాఖ అసిస్టెంట్ అధికారులు వల్లూరి ప్రేమ్,కే. నాగబాబు రైతులు పాల్గొన్నారు.

# రోటరీ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



రోటరీ జంగారెడ్డిగూడెం నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్, 24-25 సేవా సంవత్సరానికి నూతన కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. పట్టణంలోని శ్రీ మల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో రోటరీ జిల్లా 3020 గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షునిగా ఊడా రాంగోపాల్ (గోపీ), కార్యదర్శిగా బవిరిశెట్టి హనుమాన్ తిలక్‌లకు బాధ్యతలు అందజేశారు. నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు ఊడా రాంగోపాల్ ప్రకటించారు. తమ వ్యక్తిగత వితరణ అంతర్జాతీయ రోటరీ ఫౌండేషన్‌కు రూ. 2.07 కోట్లు ఇటీవల ప్రకటించిన గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావును రోటరీ జంగారెడ్డిగూడెం సభ్యులు ఘనంగా సత్కరించారు. ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదును రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు కేఎల్ఎస్ ధనకుమార్, చామర్తి శ్రీరాములు టీవీబీఏవీ రామతారకం, గణిత ఆనంద ప్రసాద్, పాలపర్తి శ్రీనివాస్, పడాల సూర్యనారాయణరెడ్డి, కొమ్ముకూరి నాగేశ్వరరావు, అయినపర్తి చంద్రశేఖర్, గవరయ్యగుప్త, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.



# రోటరీ క్లబ్ సభ్యులకు సత్కారం



నూతన కార్యవర్గ సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న దృశ్యం

**కొయ్యలగూడెం:** దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రోటరీ క్లబ్ ప్రధానంగా కృషి చేస్తోందని డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం 2024-25 సంవత్సరానికి ఎంపికైన రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ (ఇన్‌స్టిలేషన్) సంస్థాపక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన సేవలకు గాను కొయ్యలగూడెం రోటరీ క్లబ్‌కి పదమూడు అవార్డులు రావడం క్లబ్ పనితనానికి నిదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం ఇప్పటివరకు అధ్యక్ష కార్యదర్శులుగా బాధ్యతలు నిర్వహించిన ఎ.విశ్వనాథ శర్మ, జి.శ్రీనివాసరావులను క్లబ్ సత్కరించి వీడ్కోలు పలకడంతో పాటు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.రాజశేఖర్, కె.రామచంద్రరావు (సతీష్)లచే ప్రమాణస్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో బోడిపిండి సుబ్రహ్మణ్యం, మద్దు గోపి, చిరపూరి శ్రీనివాస్, యాతం సత్యనారాయణ, దారం సత్తిరాజు, అడప సత్తిబాబు, మజ్జి సూరిబాబు, బోనగిరి పాపారావు, సంకుకొండ మాజేటి అప్పలరాజు, తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కొండముచ్చు పట్టివేత



కొండముచ్చును బంధించిన దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులను బెంబేలెత్తిస్తున్న కొండముచ్చును ఎట్టకేలకు పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. గత 20 రోజులుగా కొండముచ్చు హైస్కూల్‌లో విద్యార్థులను బెదిరించడం, వారి లంచ్ బాక్స్‌లను కింద పడేయడం చేస్తుంది. ఈనెల 11వ తేదీన విద్యార్థులపై కొండముచ్చు దాడి చేసింది. ఈ ఘటనలో ఒక విద్యార్థి చేతికి గాయమైంది. దీనిపై హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు స్పందించలేదు. విద్యార్థి గాయపడిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వెంటనే కొండముచ్చును పట్టుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్ మంగళవారం కొండముచ్చులు పట్టుకునే వారిని రప్పించారు. వారు కొండముచ్చును బంధించి సుమారు 60 కిలోమీటర్ల దూరంలోని అటవీప్రాంతంలో వదిలివేశారు. కొండముచ్చు బెడద తీరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మికి, మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

### శ్రీశయనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి

**ఏలూరు (టూటౌన్):** ఏలూరు నగర శ్రీశయన సంక్షేమ సంఘం అభివృద్ధికి తన శాయ శక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు లొట్టి రమేష్ తెలిపారు. ఏలూరు నగర శ్రీ శయన కుల సంక్షేమ సంఘ సమావేశం సెంట్రల్ కమిటీ సీనియర్ నాయకులు రుప్పా రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ టీడీపీ శ్రీ శయన సాధికారిక కమిటీ అధ్యక్షుడు పట్నాల వెంకటేష్ బాబు, ఏపీ రాష్ట్ర శ్రీశయన కమిటీ అధ్యక్షుడు లోడ అప్పారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సంఘం సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడారు. ఏలూరు నగర శ్రీశయన సంక్షేమ సంఘానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా కోలా కనకారావు, గౌరవ సలహాదారుడిగా ఓలిపల్లి చంద్రశేఖర్, అధ్యక్షుడిగా లొట్టి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బోగాది ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా చలపతి ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెంటా శ్రీనివాస్, కోశాధికారిగా పూతి రాజు, ఉపాధ్యక్షులుగా పట్నాల మోహనరావు, లొట్టి త్రినాథ్‌రావు, తాబేలు మోహనరావు, సహాయ కార్యదర్శిలుగా గుజ్జుల జగదీష్, కోలా బాల సుబ్రహ్మణ్యం, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ సీనియర్ నాయకులు బుజ్జా భాస్కరరావు, లావేటి రామాంజనేయులు, సింగవరపు ప్రసాదరావు, కోలా హరిబాబు పాల్గొన్నారు.

### విద్యుత్ చౌర్యంపై కేసు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** పోలవరం మండలం మనుగోపుల గ్రామంలో కోటం పోచమ్మ అనే వ్యక్తి తన ఇంటి ఏసీకి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్టు గుర్తించి, ఆమెపై కేసు నమోదు చేసినట్టు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెకు రూ.50,657 అపరాధ రుసుం, రూ.4 వేలు జరిమానా విధించినట్టు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.